చాతుర్యాన్ని చూపుదువుగాని, ప్రస్తుతానికి నేను అడిగే దానికి కాస్త తిన్నగా జవాబు చెప్తావా?"

"అవశ్యం" బుద్ధిమంతుడిలా కూర్చున్నాడు వాసు.

"బీరకాయలు ఖాళీ చేస్తున్నావటగా?"

"బీరకాయలా?" ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూశాడు వాసు.

"కాకపోతే గుర్ర మెక్కడ మనుకో" ఠకీమని అనేసింది విజయ.

"వహ్వా! సంస్కృతం ఎప్పుడ్నుంచి నేర్చుకుంటున్నావు విజయా?" నవ్వాడు వాసు. భస్మం చేసేలా చూసింది విజయ.

"అది కాదు విజయా! నీకీ పర్యాయ పదాలన్నీ ఎలా తెలిశాయి? బావగారేమన్నా ద్రావకాల రుచి చూపిస్తున్నారా?" నవ్వాడు వాసు.

"నీ తెలివికి సంతోషించాను"

"ధన్యుడిని."

"అబ్బబ్బ! కొంచెంసేపు సీరియస్‌గా వుండలేవూ? అసలెందుకు త్రాగుతున్నావో ముందు చెప్పు."

"అదేమిటి విజయా! ఫార్మకాలజీలో చదువుకోలేదూ నువ్వు?! ఆల్కహాలు గుణము లేవేవి యనగా...." చటుక్కున లేచి నుంచుంది విజయ.

"అరెరె! లేచావేమిటి? యింక సీరియస్‌గా జవాబు చెప్తాను. మా అమ్మవు కదూ! కూర్చో!" బ్రతిమాలుతున్న వాసు ముఖం చూసి నవ్వేసి కూర్చుంది విజయ.

"అది కాదు వాసూ! ఎందుకీ అలవాటు చేసుకుంటున్నావు చెప్పు?" ఆవేదనగా వాసు వంక చూసింది విజయ.

తిట్టదూ? అరే! ఆ అమ్మాయి కదూ! ఎంత స్మార్ట్‌గా ఉంది! ఫోటోలో చూసి ఫరవాలేదను కున్నాడు కాని ఆమె యింత చక్కటిదని తను అను కోలా! ఈమెది బొత్తిగా ఫోటోజెనిక్ ఫేస్ కాదన్నమాట.

"హలో!" అప్రయత్నంగా అనేశాడు ఆమె తన ప్రక్కకు రాగానే. చురుగ్గా చూసిందామె.

"నేను విజయ కజిన్ బ్రదర్‌ని."

"నమస్తే." అందంగా చేతులు జోడించిం దామె. ప్రతి నమస్కారం చేస్తూ 'నమ్రత మూర్తీభవించి నట్లుందీమె.' అనుకున్నాడు వాసు.

భాగ్యనగరం విశాల వీధుల్లో గుండా కారు రయ్యిన పోతూంది.

"మీరు ఫైనలియరా అండి ఇప్పుడు?" ఆమె వంక చూశాడతను.

"అవునండి" కళ్ళెత్తి అతని వైపు చూసిందామె. 'ఈ అందమైన కళ్ళల్లో ఇంత కాంతి, ఆకర్షణ ఎక్కడ నుండి వచ్చాయి?'— అనుకుం టున్నాడతను. 'విజయ తన ఫ్రెండ్ ఇలా వుంటాడని, అదీ తన ఊహ ల్లోని రాకుమారుడులా వుంటాడని ఎప్పుడూ చెప్పలేదే? ఎంత మేన్లీగా వున్నాడితను' అనుకుంటూంది ఇందుప్రియ.

ఎవరి ఆలోచనలలో వాళ్ళు వుండగానే కారు ఇంటి ముందాగింది. గులాబీలనూ, చామంతుల్నీ, కనకాంబరాల్నీ చూచి 'థాంక్ గాడ్. మొక్కల విషయం ఒక్కదానిలో విజయకు బద్ధకంలేదు, అనుకున్నది ఇందుప్రియ.

"స్వాగతం, సుస్వాగతం" అంటూ నవ్వుతూ ఎదురొచ్చింది విజయ.

"చాల్లే సంతోషం. స్టేషన్‌లో నువ్వు కనపడక పోయేసరికి ఎంత కోపమొచ్చిందో తెలుసా?" ఇందుప్రియ ముఖంలో కోపచ్ఛాయలు చూసి ఫక్కున నవ్వింది విజయ.

"శిక్షా? మహాభాగ్యమను. మేము కూర్చుంటే నీ కారు పవిత్ర మయి పోదూ!"

"నయం. నేను తరించి పోతాననలేదు."

"ఫుల్‌స్టాప్. మీ ఇద్దరి మాటలూ అయిపోయేసరికి ఇందు ఆకలితో శోషొచ్చి పడిపోతుంది."— మూర్తి.

"నిజంగా చెప్తున్నా వాసూ! ఇందుకు భాగ్యనగర విశేషాలన్నీ చూపించాలి. నాతో పెట్టుకుంటే అన్నీ చూసేసరికి కనీసం పది రోజు లన్నా పడుతుంది. పది రోజులు ఇందు ఇక్కడ వుందంటే అక్కడ సర్జరీ, మెడిసిన్ విషాద గీతాలు పాడేస్తాయి వెళ్ళాక. అంచేత నువ్వు నీ పనుల్ని మీ ఫ్రెండ్, పార్టనర్, అర్ధాంగి ఎట్సెట్రా రాంబాబుకి అప్పగించి నాలుగురోజులు ఇందుప్రియా విధేయుడవై వుండాలి."— ఇందుప్రియ వంక చూసి నవ్వింది విజయ,

"సరే ననవయ్యా మహానుభావా! కాదంటే యిప్పుడు తారాజువ్వలా లేస్తుంది."— విజయ వంక చిలిపిగా చూశాడు మూర్తి.

"ఆయనన్ను శ్రమ పెట్టడమెందుకు విజయా? మరోసారి చూడొచ్చు. ఇప్పుడేం మునిగిపోయింది?" ఇబ్బందిగా ముఖం పెట్టింది ఇందు ప్రియ.

"అబ్బే! శ్రమేముందండీ." వాసు మొహమాటపడడం చూసి నవ్వుకుంది విజయ.

"ఓ. కె. యీవెనింగ్ కలుస్తాను." వెళ్ళిపోయాడు వాసు.

రాత్రి పిక్చర్‌నుంచి వచ్చాక పడుకుని కబుర్లు మొదలు పెట్టారు విజయ, ఇందుప్రియ.

"మా అబ్బాయి ఎలా వున్నాడే?" గొంతు తగ్గించి అడిగింది విజయ.

"ఎవరు?"

"బొత్తిగా అమాయకురాల్లా నటించకు! ఇప్పటివరకు తమ ప్రక్కన కూర్చుని సినిమా చూడకుండా ఇంకెటో చూస్తున్న అయ్యగారు." చిలిపిగా చూసింది విజయ.

"ఎలా వుంటారు? మనిషిలా వున్నారు." పెంకెగా చూసింది ఇందుప్రియ.

"అదే, కావలసిన మనిషిలా వున్నాడా అని" చిత్రంగా కళ్ళార్పింది విజయ.

"పోవే" విజయనో దెబ్బవేసి, అందంగా కళ్ళు త్రిప్పింది ఇందుప్రియ. ఆమె కళ్ళల్లో ప్రతిఫలించిన 'ఇష్టాన్ని' గుర్తించింది విజయ.

ఉదయమే కారు తీసుకు వచ్చాడు వాసు. తెల్ల గులాబీని హెయిర్ పిన్‌తో కుడివైపుకు కనపడేలా పెట్టుకుంటూంది ఇందుప్రియ.

"లేట్ అయానా?" గులాబీని, గులాబీవలె ఉన్న వేళ్ళనీ చూస్తూ అడిగాడు వాసు.

"లేదు. విజయిప్పుడే లేచింది. హాస్పిటల్‌కు టైమయి పోయిందని స్నానానికి పరుగెత్తింది."

"మామయ్యా!" బాబు, పాప పరుగెత్తుకొచ్చి అతని ఒళ్లో ఎక్కి కూర్చున్నారు.

ఇందుప్రియ లోపలికి వెళ్ళింది. హడావిడిగా తల దువ్వుకుంటూంది విజయ.

"అదికాదే. నేనుకూడా మీతో హాస్పిటల్‌కు వచ్చేస్తాను లెద్దూ, నేను ఒక్కదాన్ని వెళ్తే బోర్ కొడుతుంది."

